కథానిక

# ఉద్యోగాధ్యాయం

బి. యస్. ఆర్. కృష్ణారావు

"నా పేరు గోపాలరావండి! బి. కాం. ప్యాసయ్యాను."

"అయితే?" వంచిన తల పైకెత్తకుండా అన్నాడు మేనేజరు. ఆమాట గదంతా ప్రతిధ్వనించింది. గోపాలం చెవులు గింగురుమన్నాయి. గుండె ఝల్లుమంది. కాళ్ళు వణకకపోలేదు. మేనేజరు ముఖం చిట్లించి, పళ్ళు బిగించాడు—కళ్ళద్దాలనుంచి క్రూరదృష్టులు ప్రసరిస్తూ. లేని ధైర్యాం తెచ్చుకుని గోపాలం—"హిందూ పేపరులో మీ ఎడ్వర్టయిజ్‌మెంటు చూశాను. తమరిని చూద్దామని వచ్చాను. మీ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తే..."

"ఉద్యోగం! ఇక్కడ వూరికే వున్నది. క్వాలిఫికేషన్స్ వున్నా లేకపోయినా ప్రతివాడికీ ఉద్యోగం కావాలి. చేరేవరకూ ఒక ఎత్తు, చేరినతర్వాత ఇంకో ఎత్తు' అని మళ్ళీ విసుక్కున్నాడు మేనేజరు.

"నేను బి. కాం. మొదటి క్లాసులో ప్యాస్ అయ్యాను. నా సర్టిఫికెట్లు చూస్తే మీకే తెలుస్తుంది. మీ ప్రకటనలో కూడా బి. కాం. ప్యాసయితే చాలని వివరించారు" అన్నాడు గోపాలం, అవకాశం జారవిడవకూడదని.

"అయితే వున్న ఉద్యోగాలన్నీ బి. కాం. ప్యాసయినవాళ్ళకే ఇస్తే మేం మంచివాళ్ళమూ లేకపోతే కాదన్నమాట! నా టైం పాడు చెయ్యక వెళ్ళు. ప్ల్యాన్!" అని గట్టిగా పిల్చాడు. ఇంక లాభం లేదని గోపాలం ముఖం తుడుచుకుంటూ బయట కొచ్చాడు.

సాయంత్రం మిత్రుడు కేశవరావుతో గోపాలం జరిగిన విషయమంతా చెప్పాడు.

"విద్యాన్వేషణకు సంబంధించిన భావరాజ్యంలో విహరిస్తూ, శక్తికొలదీ సభ్యతా సంప్రదాయాలను పాటిస్తూ క్రమక్రమంగా పాతికేళ్ళ జీవితాన్ని ఆ వాతావరణంలో గడపిన వాడికి బయటి ప్రపంచంలోని ప్రలోభాల విషయం ఎట్లా తెలుస్తుంది గోపాలం?" అన్నాడు కేశవరావు.

ఈ మాటకు గోపాలంలో కాస్త చలనం కలిగింది. ఒక్క క్షణంపాటు మిత్రుడి ముఖంలోకి చూసి, "నీ భావం నా కర్థమయింది కాని మోసానిక్కూడా హద్దనేది ఉండాలి" అన్నాడు.

"మోసానికి హద్దేమిటి? మోసం చెయ్యవచ్చా చెయ్యకూడదా అనే విషయం ముందు తేల్చుకుని, మొదటిదానికి ప్రాముఖ్యం ఇచ్చినట్లయితే, సముద్రానికయినా ఆనకట్ట కట్టవచ్చేమో కాని మోసానికి కట్టలేము. శ్రీమహావిష్ణువుకు పది అవతారాలయితే మోసగానికి వెయ్యి అవతారాలు. భారతానికి పద్ధెనిమిది పర్వాలయితే మోసకారి మోసాలు గ్రంథస్థం చేస్తే పది పద్ధెనిమిదిలు దాటిపోతాయి. పరంపరాగతాలయిన మన సభ్యతా సంస్కారాలు నిర్ణయించినమార్గాన్నే ముక్కుకు సూటిగా పోతూవుండేవారికి ఇవన్నీ తెలియవు. బి.కాం. ఫస్టుగా ప్యాసయినా మోసాలను పోల్చుకోవడంలో ఓనమాలు కూడా దిద్దుకో లేదు" అన్నాడు కేశవరావు.

"అవును. నువ్వు చెప్పింది నిజమే. విశ్వవిద్యాలయంలో ఆస్తినంతా హారతికర్పూరంలా వెలిగించి, మొదటి తరగతిలో ఉత్తీర్ణుడనయి కొరగాని సర్టిఫికేట్లు సంపాదించాను. వాటికి విలువ వుందని ఇదివరకు అనుకున్నా గాని నేటి సంఘటన చూస్తే లేదని తేలిపోయింది." అన్నాడు గోపాలం కొంచెం విచారస్వరంతో.

"అధికారంలో వున్నవారి విచిత్ర ప్రకృతే అంత. నా ఉద్యోగం విషయం అధికార్ల దర్శనార్థం ఎంత పడిగాపులు కాచి, విసిగివేసారి చివరకు సంపాదించ కలిగానో నీకు తెలియంది కాదు. అందులో ఈ రోజుల్లో కమ్యూనల్ జీ. ఓ

కోటికి పడగ లెత్తుతున్నది. అధికార్ల దృష్టిలో అది ఆదిశక్తియై, మహాశక్తియై, త్రింశత్కోటి దేవతారూపయై విరాజిల్లుతున్నా, మనబోటి వారికి మహామారిగా కనబడుతున్నది. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా అన్నట్లుగా సర్టిఫికెట్లు చూసి ఉద్యోగాలిచ్చే రోజులు పోయాయి. అవెందుకూ పనికి రావిప్పుడు.''

ఈ మాటలు గోపాలం మనస్సులో గాఢంగా నాటుకుపోయాయి. తను ఈ చదువుకోసం ఎంత ఇబ్బంది పడ్డాడో, పిత్రార్జితమైన రెండెకరాలూ పోగా కడపటి రోజుల్లో జీతం కట్టటానికూడా కానీ లేక ఎంత అవస్థపడి చదువు పూర్తిచెయ్యగలిగాడో తల్చుకునేసరికి గుండె చెరువైపోయింది.

''గోపాలం! ఈరోజుల్లో ప్రాపకం వున్నవాడికే ఉద్యోగాలూ, పదవులూను. కేవలం సరస్వతీ పుత్రుడికి లక్ష్మి దూరమవుతుంది. అధర్మం ధర్మంగానూ, కర్తవ్య మకర్తవ్యంగానూ విపరీతమైతోచే స్థితిలో దేశం వుంటే ఇంక నీ మాటా నామాటా విని సహాయం చేసేవారెవరు? అధర్మమగు బాటయే ఉత్కృష్టమని వాదించే విపరీత ధర్మాచరణుల ప్రతిష్ఠ హెచ్చి, జీవితానుసరణానికి అదే మార్గమని ప్రతివారూ బోధించే ఈ రోజుల్లో మనబోటివారికి తావు లేదు. అధర్మ ప్రబోధాలకీ, లౌకిక ప్రబోధాలకీ ఈ రోజుల్లో వున్నంత విలువ మరే రోజుల్లోనూ లేదు. కాబట్టి ఈరోజుల్లో ఉద్యోగం దొరకాలంటే ధనమైనా వుండాలి, అధికార్ల ప్రాపకమయినా వుండాలి. రెండూ లేకపోతే ఏమీ లేదు.''

''మరి పత్రికలో బి. కాం. ప్యాసయితే చాలనీ, వయస్సు యిరవై అయిదు సంవత్సరాలకి లోపున ఉండాలనీ, అధికార్లను ఇన్‌ఫ్లూయన్స్ చేసి ఉద్యోగం సంపాదించబోయేవారి చర్యలు తీవ్రంగా ఖండింపబడుననీ ప్రకటించారే? దరఖాస్తుతో అయిదురూపాయలు ఫీజుకట్టి రసీదు జతపర్చాలనికూడా ప్రకటించారు. నా దరఖాస్తుతో చలాను జతపరిచే పంపించాను. అఫీసు మేనేజర్ని కలుసుకున్నాను. ఇంతకన్న చేసేదేముంది చెప్పు.''

''ఇంతవరకుదాకా నే చెప్పేదే అది. కాకులను కొట్టి గద్దలకువేయుట మన్నట్లుగా అధికార్లు చేస్తుంటారు. ఏసంస్థలోనైనా ఒకపోస్టు కాళీ వుంటే నింపటానికి పెద్ద హంగామా చేస్తారు. అవసరం వున్నా లేకపోయినా దానికి కొన్ని క్వాలిఫికేషన్లు పెట్టి, గవర్నమెంటు ట్రెజరీలో ఇంతడబ్బు కట్టి ఆరసీదుతో అప్లికేషన్‌ఫారం పంపించమంటారు. ఈవిధంగా చేస్తే ఆ ఒక్క కాళీకి ఏ వెయ్యి దరఖాస్తులో వస్తాయి. ఈ వెయ్యి దరఖాస్తులకూ వచ్చేఫీజు ఆ సెలక్టు అయిన వాడికి కనీసం మూడేళ్ల జీతంకింద సరిపోతుంది, అసలు సంస్థవాళ్ళ డబ్బు దమ్మిడీ ఖర్చుకాకుండానే. ఇవన్నీ ఉద్యోగపు కిటుకులు. ఇంతా క్లాసులు సంపాదించినవాళ్ళంతా గుండెలు చరుచుకుని, నేను యూనివర్సిటీలో ఫస్టుగా ప్యాసయానంటే నేను రాష్ట్రం మొత్తంమీద ఫస్టులో ఫస్టుగా ప్యాసయానంటూ, నాకివ్వక ఆ వుద్యోగం మరెవరకిస్తారని ఆశతో కూర్చుంటారు. పైకింత తతంగం జరుగుతున్నా ఆ కాళీ ఇదివరకే ఆఫీసరు బావమరిదికో, మేనల్లుడికో నిర్దేశించబడి వుంటుంది. వాడికే ఇచ్చితీరతారు ఇదివరలో ధనసంపాదనకు ఉద్యోగం మూలం. ఈరోజుల్లో ఉద్యోగసంపాదనకు ధనంమూలం. చెయ్యబోయే ఉద్యోగం రెండుసంవత్సరాలే అయినా ఆ ఉద్యోగం సంపాదించటానికి ఆరునెల్ల జీతం ముందు ఖర్చుపెట్టాలి'' అన్నాడు కేశవరావు వుద్రేకపూరితమైన కంఠంతో.

''అయితే మరి మార్గం'' అని కేశవరావు ముఖంలోకి కన్నార్పకుండా చూశాడు గోపాలం. ఉద్యోగసంపాదనకు గోపాలం పడుతున్న కష్టాలు ఆకళింపు చేసుకున్నవాడవటంచేత అతనూ గోపాలం ఆదుర్దాలో సగభాగం పంచుకోక తప్పిందికాదు.

''ఇప్పటి పరిస్థితులను బట్టి చూస్తే ఒక వైపరీత్యం కలుగుతుంది, గోపాలం. ధనలోకమే అందరి దృష్టినీ ఆకర్షిస్తూ వుంటే యిక సభ్యతకి చోటెక్కడ? జీవనపరమార్థానికీ, జీవన అంతరార్థానికీ సంబంధించిన విషయాలు విశదంగా తెలుసుకుని ఆకళింపు చేసుకునే శక్తిసామర్థ్యాలు లేనివారికి పీడితజీవిత సమస్య ఎట్లా బోధపడుతుంది? త్యాగంలోవుండే మహా

త్వం, పరాక్రమంలోగల గౌరవం, బ్రహ్మచర్యంలోగల ప్రభావం తెలియనట్లే లక్ష్మియందే మనస్సు లగ్నం చేసుకున్నవారికి సరస్వతిలోని సౌహార్దం, విలువా తెలియవు కనుక ఆ ఉద్యోగంయొక్క విలువ నెలకు నూటపది రూపాయలు కాబట్టి కనీసం మూడునెలల జీతం మనది కాదనుకుంటే, అప్పటికయినా ఒకదారికి రాగలదేమో."

ఈవిధంగా కేశవరావు చెబుతాడని గోపాలం అనుకోలేదు. మూడువంద లనగానే అతని కళ్లు చీకట్లుకమ్మాయి. తనవద్ద ప్రస్తుతం మూడు వందలే కనక వుంటే తనూ, తనభార్యా కనీసం ఆరునెల్లయినా జీవించగలిగేవారు.

"కాలప్రభావంచేత మనబోటివారి వెన్నెముక విరిగిపోయిన సంగతి నీకూ తెలిసిన విషయమే, కేశవా! నాలాంటివాళ్లు ఎంతమంది ఆ ధనపిశాచి బారినుండి తప్పించుకోలేక గిజగిజలాడుతారో ఆలోచించు!" అన్నాడు గోపాలం.

"కోప్పడకు గోపాలం. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఉన్న విషయం చెప్పాను. మనకా అండలేదు, ధనం సున్నా. అటువంటప్పుడు మనవైపు కన్నెత్తయినా ఎవరూ చూడరు. ఇంతకు మించి గత్యంతరం లేదు కనక చెప్పాను. ఐనా ఆలోచించి చూడు" అని కేశవరావు లేచాడు. ఇద్దరూ ఎవరియిళ్ళకువాళ్లు వెళ్లిపోయారు.

ఆరాత్రి భార్యతో ఈ విషయం ప్రస్తావించాడు గోపాలం.

"మూడువందలు విస్తళ్ళ ఉన్నాయని ఆరువందల మందికి సమారాధన చెయ్యటానికి పూనుకున్నాట్ట. అట్లావుంది మీరు చెప్పేది. మూడువందలరూపాయలు లంచం ఇచ్చి ఉద్యోగం సంపాదిస్తే అది ఎంతకాలం వుంటుందో- తీరా ప్రవేశించిన రెండు మూడు నెల్లకే వెళ్లిపొమ్మంటే?" అన్నది సీత. మంచంమీద పడుకుని నిరాశగా పైకి చూస్తున్న గోపాలంతో.

"అది శాశ్వతమైన కాలీయే నని ప్రకటించారు. బహుశా ఇప్పట్లో పొమ్మనరు. నెలకు నూటపదిరూపాయల జీతం. ఆఫీసు మేనేజరుకు కనీసం మూడువందలన్నా 'కట్నం' ఇస్తేనేగాని ఉద్యోగం రాదు."

"ఆ ఉద్యోగానికి కావలసిన చదువు మీకున్నది కదా! పైగా ఫస్టున ప్యాసయ్యారు కూడాను. అటువంటప్పుడు చదువునుబట్టయినా యివ్వాలిగా మరి" అన్నది సీత అమాయికంగా.

"ఈ రోజుల్లో చదువులు ఎకరాలు మింగేందుకేగాని ఉద్యోగాలు సంపాదించేందుకు కాదు సీతా! ఈ విషయంలో నిన్నటిదాకా నేనూ పొరబడ్డాను. ఇప్పుడు తెలుసుకున్నాను" అన్నాడు గోపాలం నిరాశగా.

"అయితే మరి మూడువందలూ ఇప్పుడు ఎక్కడనుంచి తెచ్చి ఇచ్చేటట్లు? మూడువందలుంటే ఆర్నెల్లు నిక్షేపంలా తినేవాళ్లమే. అయినా ఆఫీసు మేనేజరంటే కనీసం మూడు వందలయినా జీతం వుంటుందికదా. కొన్ని సంవత్సరాలనుంచీ ఉద్యోగంలో వుంటూ నెలకు కనీసం మూడు వం ద లు సంపాదించేవాడికి కొత్తగాచేరే గుమాస్తా మూడువందలు లంచం ఇవ్వాలా! ఇదెక్కడి న్యాయమండీ. ఇలాగని ఆ మేనేజరుతో చెప్పకపోయారూ?"

"నీ పిచ్చిగాని డబ్బంటే ఆపేక్ష ఎవరికి లేదు! అందులో వచ్చే ఇరువున్నప్పుడు ఎవరు వద్దంటారు? ఉన్నవాడూ వున్నవాడికే పెడతాడు, లేనివాడూ వున్నవాడికే ముట్టచెబుతాడు- తన అవసరంకొద్దీ. లక్షాధికారికి ఇంకోలక్ష సంపాదించాలని వుంటుంది. భిక్షాధికారికి బియ్యపు గింజకూడా పొరాగతం లేదు. నిత్యజీవితావసరాలను గడుపుకునేందుకు ఇవన్నీ మార్గాలు."

"మరయితే ఏం చెయ్యమంటారు?"

"అదే నాకూ తోచకుండా వుంది. ప్రపంచంలో పుట్టటమే తప్పనిపిస్తుంది. నిత్యం బాధపడుతూ బుర్రపాడు చేసుకుని, జీవచ్ఛవంలా తిరుగుతూ జీవన్మృతునిలా బ్రతికేదానికన్న ముక్కుమూసుకుంటే..."

"చాల్లెండి- ఇట్లాంటి మాటలు ఇకముందెప్పుడూ అనకండి. ఇంతకే ఇంత నిరుత్సాహపడితే ఎట్లా చెప్పండి! మిమ్మల్ని నమ్ముకున్న నే నేం కావాలి?" అన్నది సీత జాలిగా అతని వైపు చూస్తూ.

"ఏమిటో కష్టాలు పడలేనప్పుడు అట్లా అనిపిస్తుంది, సీతా. ఇంతమాత్రానికే చస్తే రోజూ ఎన్నిసార్లు చావాలో!"

"మీరు కాదనకుండా వుంటే నేనో వుపాయం చెబుతా- వింటారా" అన్నది ఆశగా.

"ఏమిటది" అన్నాడు గోపాలం ఆదుర్దాగా.

"నా మెళ్ళో గొలుసు అమ్మితే సుమారు నాలుగువందలు రావచ్చు. అది అమ్మేసి ఆఫీసు మేనేజరు కిచ్చి ఉద్యోగం మీ కొచ్చేటట్లుగా చేసుకోండి రోజులు కలిసొచ్చి ఉద్యోగం నిలకడగా వుంటే, నాలుగు డబ్బులు కూడబెట్టుకున్న తరువాత మళ్ళీ చేయించుకోవచ్చును."

"హుఁ! బాగా చెప్పావు సీతా. నే చేయించి పెట్టేది లేకపోగా మీవాళ్లు చేయించిన గొలుసును ఖర్చుచెయ్యమంటావా! న్యాయం లేదు సీతా" అన్నాడు.

"ఆడదానికి సుఖదుఃఖాలు భర్త ప్రేమలో ఉన్నాయి కాని వస్తువుల్లో లేవు. మన అదృష్టం ఫలించి మీరింత సంపాదిస్తే నగలకేమీ కొరత వుండదు. కాబట్టి నామాట విని ఆ పని చెయ్యండి. మనస్ఫూర్తిగా చెబుతున్నాను" అన్నది సజలనయనాలతో అతని ముఖంలోకి చూస్తూ. జాలిగా బ్రతిమాలుతున్నట్టుగా చెప్పటంనుంచి గోపాలం కాదనలేకపోయాడు. వణకుతున్న హస్తాలతో సీత ఇస్తున్న గొలుసును అందుకున్నాడు.

గొలు సమ్మి మర్నాటికల్లా డబ్బు సేకరించుకుని గోపాలం మేనేజరు ఇంటికి వెళ్ళాడు. విషయం తెలిసినవాడే అవటంచేత మేనేజరు ఎందు కొచ్చావని అడగలేదు, తన రొట్టె విరిగి నేతిలో పట్టానికే గోపాలం ఈ విషయంలో మాట్లాట్టానికి ఇంటి కొచ్చాడని.గోపాలం డబ్బు మేనేజరు చేతిలో పెట్టాడు. మొట్టమొదటగా మేఘదర్శనంకాగానే మయూరం ఎట్లా నాట్యం చేస్తుందో అలాగే ఈమూడువందలూచూడగానే ఆయన మనస్సు నాట్యం చేయసాగింది. పెళ్ళినాడు పుట్టింటివారు భార్యకు పెట్టిన బాల తొడుగు తాలూకు గొలుసును ఈ విధంగా దుర్వినియోగపరచవలసి వచ్చినందుకు గోపాలం మనస్సు కుమిలిపోయింది.

"దయ వుంచి నా కా ఉద్యోగం ఇప్పించండి. మీపేరు చెప్పుకుని..." ఇంక అనలేకపోయాడు గోపాలం.

"అంతగా చెప్పాలా అబ్బాయ్! నా కామాత్రం తెలియదూ! బీ. కాం. యూనివర్సిటీకి ఫస్టుగా ప్యాసయిన నీకు కాక మరెవరికా ఉద్యోగం! తప్పక నీకే ఇప్పిస్తాను. జాగ్రత్తగా చేసుకో. నెలకు నూటపదిరూపాయల జీతం. సోమవారంనాడు ప్రవేశిద్దుగాని ఈ లోగా ఆర్డరు వేయిస్తాను" అన్నాడు మేనేజరు డబ్బు జేబులో పెట్టుకుని మీసాలు తిప్పుకుంటూ. మళ్ళీ ఒకసారి ప్రాధేయపడి వచ్చేశాడు గోపాలం బయటికి.

సోమవారంనాటికి ఆర్డరు వచ్చింది. సంతోషంతో కేశవరావుకు చూపించాడు గోపాలం.

'డబ్బుతోనే ప్రపంచం వుందని ఇప్పుడైనా గ్రహించు గోపాలం. ఆ రోజున అంత విదిలించి పారేసి మాట్లాడినవాడు మొన్న అంత ఆప్యాయంగా మాట్లాట్టానికి కారణం ధన దర్శనం. కనకనే 'ధనమూల మిదం జగత్' అన్నారు పెద్దలు."

ఆర్డరు కాగితం సీతకు చూపించాడు. గొలుసు పోయినా భర్తకు ఉద్యోగం దొరికినందుకు సంతోషించింది. పెందరాళే వంటచేసి గోపాలానికి పెట్టి ఆఫీసుకు పంపించింది. ఈ ఉద్యోగం కలకాలం వుండాలని మనస్సులో వేయిదేవుళ్ళకు మొక్కుకుంది. ఇంట్లో వస్తువులు చాలీ చాలకుండా వున్నా, నెలాఖరుకు జీతం రాగానే అన్నీ తెచ్చుకుని సుఖంగా జీవించవచ్చుననే సంతోషంతో, కష్టం అనుకోకుండానే గడిపివేసింది. నెలాఖరుకు జీతం నూటపది రూపాయలూ వచ్చాయి. చాలాసంతోషించింది.

ఈ విధంగా మరి రెండు నెలలు గడిచిపోయాయి. ఆ రోజు ఒకటో తారీఖు. మళ్ళీ జీత మొస్తుంది కదా అనే ఆనందంతో వున్నది సీత. గోపాలం రాకకు ఎదురుచూస్తూ కూర్చుంది.

గోపాలం వుసూరుమంటూ వచ్చి మంచం మీద కూర్చున్నాడు. సీత అడిగింది, అట్లా వున్నారేమని. ఉద్యోగంలోంచి తొలగించారని చెప్పాడు గోపాలం.

సుందరమూ, నీలమూ, ఉజ్వలమూ అయిన వసంతాకాశంలోకి ఎక్కడినుంచో ఒక కాలమేఘం వచ్చి ఎలా వ్యాపిస్తుందో, అలాగే ఆమె హృదయాకాశంలోకి ఎక్కడి నుంచో ఒక మేఘం వచ్చి చటుక్కున అంధకారమయం చేసింది- ఈ మాట వినగానే ఆరోజల్లా వాళ్లకి నిద్రాహారాలు లేవు. సీత విచారానికి అంతం లేదు. గోపాలం కూడా లోపల్లోపల కుమిలి పోతున్నాడు.

ఈ విషయం తెలిసి కేశవరావు వచ్చాడు. సంగతంతా విన్నాడు.

"నావల్ల ఏ తప్పూ లేందీ ఎందుకు తీసేశారో అర్థంకావటంలేదు కేశవా! ఆఫీసు పని బాగానే చేస్తున్నాను. ఒక్క రిమార్కు కూడా రాలేదు. మరి ఈవిధంగా ఏకారణమూ చెప్పకుండా ఎందుకు తీసేశారో అడిగినా ఎవరూ చెప్పలేదు. రేపు ఎవరో ఇంకొక కొత్తఅతను జాయినవుతాట్ట. అతను ఇంటరు మాత్రమే ప్యాసయ్యాడు. మూడువందలు లంచం తిన్న మేనేజరు కూడా ఏ సమాధానమూ చెప్పలేదు" అన్నాడు గోపాలం విచారంగా.

"ఏ విరుద్ధకాల ప్రభావంలో ఈ సన్నివేశంలోకి లాగబడి ఆవృతమయావో, నీకు తీరని నష్టం సంభవించింది గోపాలం. మూడువందలూ ఖర్చుచేసినందుకు మూడు నెలలూ ఉద్యోగం చేశావు. మూడునెలలు చాకిరీ చేస్తే ముప్ఫయి రూపాయలు సంపాదించగలిగావన్నమాట. డబ్బు తిన్నా సహాయం చేద్దామనే బుద్ధి ఏ కోశానా లేకపోయింది, మేనేజరుకు. పోయిందని తెలిశాక ఆఫీసులో కనుక్కున్నాను. ఎవరో ప్రజాప్రభుత్వాధికారి తరఫు చుట్టానికి నీ ఉద్యోగం ఇచ్చారుట" అన్నాడు కేశవరావు కోపోద్దీపితమైన కంఠంతో.

"మూడువందలూ కాజేసి మూడు నెలలు ఉద్యోగం ఇచ్చి, మానోట్లో దుమ్ముకొట్టి ఎవరో ప్రజానాయకుడు సిఫారసు చెయ్యగానే ఆయన తరఫువారికి ఈ ఉద్యోగం ఇస్తారా!" అన్నది సీత అత్యంతావేదనతో. ఇద్దరూ సీతవైపు జాలిగా చూశారు.

# ఆత్మవంచనలోని హాయి

రావు

నాగరాజు బి. యే. ప్యాసయినట్లు తెలిసింది— దానితో తన జీవితంలో ఒకఘట్టం అయినట్లుంది. అది విద్యాఘట్టం; ఇక ఎంత ప్రయత్నించినా అంతకుమించి చదువలేడని తెలుసు. అంతవరకు చదవడంకూడా ఎన్నోకష్టాల్ని ఎదుర్కొంటూ, వాళ్ళవీళ్ళ సహాయంతో జరిగింది. ఇక పై చదువులు పెద్ద పట్నాలు వెళ్ళి చదవాలి. వాటికి ఆశించడం నిష్ప్రయోజనం అని బాగా తెలుసు.

విద్యాఘట్టం పూర్తయిందో లేదో, అప్పుడే ఇంట్లో 'పెళ్ళి' అనడం మొదలు పెట్టారు. నాగరాజు తండ్రికంటే తల్లికి తొందర ఎక్కువైంది రాజుకు వివాహంచేయడం విషయంలో. ఇక ఊరుకోలేక ఒకరోజున భోజనం చేస్తుండగా తండ్రి 'రాజూ! చదువు పూర్తయింది కదా. ఇక పెండ్లిమాట తలపెట్టవచ్చునా?' అని అడిగాడు. అప్పుడు రాజు 'ఏం పెండ్లండీ! ఎన్నో కష్టాలతో చదువు పూర్తయింది. ఇంట్లో ఉన్నదికాస్తా తుడిచిపెట్టుకుపోయింది యీ చదువుతో. ఇప్పుడు పెండ్లయినా అప్పులతో జరుగుతుంది కదా, ఎందుకు? ఇంకో నెలో రెండు నెలలో ఆగితే నేను పనిలో ప్రవేశిస్తాను. అప్పుడు మన జీవితాలకు కొంత వీలు కనిపిస్తుంది. ఆపైన అప్పు చేసి పెండ్లి చేసుకున్నా తీర్చగలమనే ధైర్యం ఉంటుంది.' అని అన్నాడు. తండ్రి ఆ మాటమీద ఏమీ అనలేక 'సరే నీ యిష్టం' అని ఊరుకున్నాడు.

బి. ఏ. రెండవ సంవత్సరం చదువుతూనే గవర్నమెంటు పరీక్షకు వెళ్లివుండటంవల్ల, రాజుకు ప్యాసయిన నెలరోజులకే ఉద్యోగం